"అవసరం లేదు. హోమం పరిసమాప్తి అయింది. జఠరాగ్నిలోని అగ్నికి వాటిని ఆహుతి చేసాం. అగ్నిదేవుడు శాంతించాడు. ఎవరికోసం మనం ఈ హోమం చేయాలనుకున్నామో వారు తృప్తి చెందారు. హోమం చేయించిన ఫలం మీకు దక్కింది." చెప్పాడు ఆ యోగి.

## 109. సత్సంగ మహిమ

ఓ దొంగ తనని తరిమే రక్షక భటుల నించి పారిపోతూ, ఓ మఠంలోకి వెళ్ళి అక్కడ సత్సంగం వినే శ్రోతల్లో కలిసిపోయి కూర్చున్నాడు. మఠాధికారి చెప్పే మాటలని ఆ దొంగ ఆలకించాడు.

"రామాయణంలో రాముడు 'ఎవరైతే ఒక్కసారైనా నన్ను శరణని 'నేను నీవాడిని' అని తనని రక్షించమని యాచిస్తాడో వారిని నేను ప్రాణులన్నిటినించి భయం లేకుండా చేసేస్తాను. ఇది నా నియమం' అని చెప్పాడు. శ్రీకృష్ణుడు గీతలో 'అత్యంత పాపి అయినా సరే, ఎవరైనా తీవ్ర భక్తితో నన్ను భజించినట్లయితే, అతడిని సాధువుగానే భావించాలి.' అని చెప్పాడు. కాబట్టి ఎంత పాపి అయినా సరే, తనకి శరణాగతి చెందితే తన భక్తుడికి కొత్త జీవితం ఇచ్చి దేవుడు ఆదుకుంటాడు."

ఆ మాటల ప్రభావం ఆ దొంగ మీద తీవ్రంగా పడ్డాయి. 'ఇకనించి నేను భగవంతుడికి భక్తుడై ఆయన్ని శరణు వేడుకుంటాను' అని గట్టి నిశ్చయం చేసుకున్నాడు. సత్సంగం ముగిసి అంతా బయటకి వచ్చే సమయంలో అక్కడే పొంచి వున్న రక్షక భటులు దొంగని బంధించి రాజు దగ్గరకి తీసుకెళ్ళారు.

"నువ్వు దొంగిలించిన నగలు, సొమ్ము ఏవి?" రాజు ప్రశ్నించాడు.

"మహారాజా! ఈ జన్మలో నేను పరుల వస్తువుని ఒక్కదాన్ని కూడా దొంగిలించలేదు." చెప్పాడు దొంగ.

ఆ రాజ్యంలోని ఆచారం ప్రకారం దొంగ నిజం చెప్తున్నాడా లేదా అని తేల్చుకోడానికి ఎర్రగా కాల్చిన ఇనుప ముక్కని అతని అరచేతిలో వుంచి గుప్పిటని మూస్తారు. అలా చేసాక ఆ దొంగ గుప్పిటని తెరిస్తే అతని అరచెయ్యి కాలలేదు!

"మీరు సాధు పురుషుడ్ని దొంగగా తెచ్చారు. మీకు శిక్ష తప్పదు." రాజు కోపంగా రక్షక భటుల మీద అరిచాడు.

"వీళ్ళు అమాయకులు. నేను నిజంగా దొంగనే. నావెంట వీళ్ళని పంపితే నేను దొంగిలించిన వాటిని ఎక్కడ దాచానో చూపిస్తాను." ఆ దొంగ రాజుతో చెప్పాడు.

ఆసక్తిగా రాజు కూడా ఆ దొంగ వెంట వెళ్తే అడవిలో దాచిన తను దొంగిలించిన సామానుని ఆ దొంగ తీసిచ్చాడు. రాజు ఆశ్చర్యంగా అడిగాడు.

"చిత్రంగా వుందే? నువ్వు ఈ జన్మలో దొంగతనం చేయలేదని నీ చెయ్యి కాలకపోవడం వల్ల రూఢి అయింది. కాని దొంగిలించిన సామానుని ఇచ్చావు. మరి దొంగవైతే చెయ్యి ఎందుకు కాలలేదు?"

"రాజా! నేను అబద్ధం చెప్పలేదు. నేను వీరినించి పారిపోతూ ఓ మఠంలోని ప్రవచనం విన్నాను. 'ఎవరైతే భగవంతుడికి సంపూర్ణ శరణాగతి చెందుతాడో వాడు చేసిన పాపాలన్నిటినించీ భగవంతుడు ముక్తుడ్ని చేస్తాడని, అవి భస్మమైపోతాయని విని అక్కడికక్కడే నేను మళ్ళీ పాపం చేయకూడదని నిర్ణయించుకున్నాను. అలాంటివారిది నూతన జన్మ అవుతుందని మఠాధిపతి చెప్పాడు కాబట్టి నేను ఈ జన్మలో దొంగతనం చేయలేదని చెప్పడంలో అబద్ధం లేదు. కాబట్టి నా చెయ్యి కాలలేదు. నేనిప్పుడు భగవంతుడికి చెందినవాడిని కాబట్టి ఇక ఎన్నడూ దొంగతనం చేయను." వివరించాడు ఆ దొంగ.

సత్సంగం ప్రభావం ఎవరి మీద ఎంత తీవ్రంగా పడుతుందో తెలీదు. కాబట్టి ఎవరూ సత్సంగ అవకాశాలని వదులుకోకూడదు.

## 110. కురచ- విశాలం

ఓ రాజు ఓ సారి అడవిలో ప్రయాణిస్తూంటే ఆయనకో ఆశ్రమం కనిపించింది. లోపలకి వెళ్తే ధ్యానంలో ఉన్న ఓ యోగి కనిపించాడు. ఆయన కళ్ళు తెరిచే దాకా రాజు ఓపికగా వేచి ఉన్నాడు. యోగి కళ్ళు తెరిచాక రాజు వంక ప్రసన్నంగా చూస్తూ అడిగాడు.